క్లుప్తంగా

యువతి అదృశ్యం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన యువతి ఈ నెల 23వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు చినమేరంగి ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు. చినమేరంగి గ్రామం కర్రి వీధికి చెందిన యువతి వాళ్ల పెదనాన్న ఇంట్లో నిద్రపోయిందని, అర్ధరాత్రి సమయంలో లేచి చూసేసరికి ఇంట్లో లేదని, పరిసరాల్లో వెదికినా కనిపించకపోవడంతో వాళ్ల తండ్రి శుక్రవారం ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేశతల్లి గుడి ప్రతిష్ఠ మహోత్సవం



అమ్మవారి ఘటాల ఊరేగింపు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామంలో దేశతల్లి గుడి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా మేళ తాళాలతో భక్తుల సందోహం నడుమ అమ్మవారి గుడి వరకు తరలి వెళ్లారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూజారి, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

సాలూరు రూరల్: మండలంలోని కురుకూటి పంచాయతీ పోతన్నవలస గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గతంలో తాగునీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడేవారు. సమస్యను గత పాలకులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతీసుకుని గ్రామంలో రూ.9 లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తుండటంతో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నవగ్రహ ఉపాలయ విగ్రహ ప్రతిష్ట

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గిరిజా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ ఉపాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అండవిల్లి సూర్యం పంతులు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ దంపతులతో పాటు మరో 8 మంది దంపతులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోతూరు పద్మావతి సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూత ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలోని శ్రీరామ ధర్మక్షేత్రంలో వారణాసి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన చెట్లు ఫలాలను కాసి, ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, నదులు ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, గోవులు కూడా పాలిచ్చి, పరోపకారం చేస్తున్నాయని తెలిపారు. మానవులు కూడా ఇతరులకు ఉపయోగపడాలని, తమకు చేతనైన సాయం ఇతరులకు చేయాలన్నారు. జగన్నాథ స్వామి చిరు వ్యాపారి అయినప్పటికీ ఆయనలో దాతృత్వ గుణం ఉండడంతో నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ సమాజ సేవకు ముందుకురావాలన్నారు.

నిర్దేశిత కొలతల్లో పని చేస్తే రోజుకు రూ.300

సంతకవిటి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో హరనాథరావు అన్నారు. మండలంలోని తాలాడ గ్రామ గంగన్నచెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేసుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేసుకుంటే ఎండల నుంచి తప్పించుకోవచ్చన్నారు. పని ప్రదేశంలో చలువ పందిర్లు వేసుకోవాలని, అలాగే తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

మేమంతా.. జగనన్న వెంటే...

- ఎన్నికల ప్రచారంలో తేల్చి చెప్పిన నులకజోడు గ్రామస్తులు
- కళావతికి అపూర్వ స్వాగతం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: జగనన్న పాలనలోనే తాము ఆర్థికంగా ఎదిగామని, చాలా వరకు సమస్యలు తీరి ప్రశాంతంగా ఉంటున్నామని అటువంటి నాయకుడి వెంటే రానున్న ఎన్నికల్లో నడుస్తామని మండలంలోని నులకజోడు గ్రామస్తులు తేల్చి చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన కళావతికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో ఆమె వెంట నడిచారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా ముందుకు వెళ్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ అందుతున్నాయని పేర్కొన్నారు. మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మా పాలనలో మంచి జరిగిందని అనిపిస్తేనే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. సర్పంచ్ కొత్తూరు ప్రసాద్, ఎంపీటీసీ బూస బాలకృష్ణ, సాసుపిల్లి విశ్వనాథం, కొన్న తిరుమలరావుల ఆధ్వర్యంలో నులకజోడులో ఎమ్మెల్యే కళావతి ప్రచారం చేశారు. సింగిడిలోనూ ప్రచారం కొనసాగించారు. పార్టీ నాయకులు తోట సింహచలం, బోనగడ్డి ధర్మారావు, కొవ్వాడ చిరంజీవులు, టింగ అన్నాజీరావు, మజ్జి మోహనబాబు, అగతముడి రఘు, గెల్లంకి రమేష్ కొత్తకోట ఆంజనేయులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఇలా...

(నాడు)



కొండ దిగువనుంచి బిందెలు, కావిళ్లతో తాగునీటిని తెచ్చుకుంటున్న ఆలవద్ద గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొండవాడ పంచాయతీ ఆలవడ్డ గ్రామంలో టీడీపీ పాలనలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ కూడా నెరవేర్చలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2023 జనవరి 30న గ్రామంలో మినీ రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. గ్రామంలో ఐదు కుళాయి కనెక్షన్లు ఇచ్చి నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. - గుమ్మలక్ష్మీపురం

(నేడు)



టీడీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు

- వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సువ్వాడ రామకృష్ణ



సాలూరు రూరల్: టీడీపీ కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి సాలూరు మండలాన్ని తానే అభివృద్ధి చేశానని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, ఆమె చెప్పే అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఆమెకు సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సాలూరు నియోజకవర్గంలో రూ.1200 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. నామినేషన్ అనంతరం నిర్వహించిన ర్యాలీలో రాజన్నదొర సాలూరు నియోజవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారన్నారు. తాను ఎవరి వద్దా లంచం తీసుకోలేదని, తనకు అబద్ధాలు చెప్పడం రాదని, తప్పు చేస్తే జనం మధ్యలో నిలదీయండని రాజన్నదొర అన్న మాటలు ఆయన నిజాయతీకి నిదర్శనమన్నారు. సాలూరు బైపాస్ తెచ్చింది, కొట్టక్కి బ్రిడ్జి నిర్మించింది, కందుల పదం బ్రిడ్జి నిర్మించింది, ప్రతి గిరిజన గ్రామానికి బీటీరోడ్లు వేయించింది, సాలూరులో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించింది, స్థానిక తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించింది రాజన్నదొరే అని, ఇందులో ఏ ఒక్క అభివృద్ధి పనైనా తాను చేశానని మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి చెప్పగలరా అని రాజన్నదొర విసిరిన సవాల్‌కు సంధ్యారాణి సమాధానం చెప్పాలని సువ్వాడ రామకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని బోసుబొమ్మ కూడలిలో టీడీపీ ర్యాలీ సందర్భంగా మాట్లాడిన సంధ్యారాణి సాలూరు నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి ఎంటో చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. మోసపూరిత మాటలు చేప్పే టీడీపీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ ఎన్నికల్లో రాజన్నదొర భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

తలే రాజేష్‌కు త్రైత సిద్ధాంత భక్తుల మద్దతు



ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌తో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార భక్తులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార భక్తులంతా వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కు మద్దతు ప్రకటించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వారంతా చేరుకుని, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, గెలిపించుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొనసాగిస్తున్న సుపరిపాలన నచ్చే తామంతా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• నిర్మానుష్యం



నిర్మానుష్యంగా పాలకొండ - విశాఖ రహదారి

పాలకొండ రూరల్: పట్టణంలో వేసవి ఉధృతి రోజురోజుకు పెరుగుతుంది. శుక్రవారం నాడు పగటి పూట ఉష్ణోగ్రత ఉదయం 10 గంటల నుంచి హడలెత్తించింది. మధ్యాహ్నం 1గంట సమయానికి 43 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారాయి. వీచిన వడగాలులతో స్థానికులు బెంబేలెత్తారు. రానున్న రోజుల్లో వేసవి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

డ్రై డేతో ఆరోగ్యవంతమైన సమాజం



చిన్నారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా డ్రై డే పాటించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్ మోహన్‌రావు అన్నారు. డ్రై డేతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చన్నారు. మండలంలోని ఆర్తాం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువవుతున్న క్రమంలో మంచినీరు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలించిన ఆర్‌ఓ

పాలకొండ : నియోజకవర్గ కేంద్రంలోని ఈవీఎంల భద్రతా గదులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సీతంపేట ఐటీడీఏ పీఓ శుభం బన్సల్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం కేటాయించిన స్థలం పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. టెంట్లు, భోజనాలు, తాగునీరు వంటి సౌకర్యాలపై తహసీల్దార్ వరహాలకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రూట్‌లు, జోన్‌ల వారీగా వాహనాల ఏర్పాటును పరిశీలించిన ఆయన రూట్ మ్యాప్‌లను సర్వేయర్ వెంకటరావు నుంచి తెలుసుకున్నారు.

రూ.1.30 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



పూజలు చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలో రూ.1.30 కోట్ల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఇప్పుడు రైతువారీ పనులతో పాటు గృహావసరాలకు అవసరమైన విద్యుత్ లభిస్తుందన్నారు. వేసవిలో పూర్తిస్థాయిలో విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే పట్టణ పరిధిలోని గోపాలపురం సబ్‌స్టేషన్‌లో రూ.1.25 కోట్లతో అదనంగా మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే నియోజకవర్గంలో నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు కూడా పంపించామన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. ప్రజలు డిజిటల్ పేమెంట్ల వైపు మొగ్గు చూపాలని, విద్యుత్ బిల్లులను 14 రోజుల్లోపు చెల్లిస్తే సర్‌చార్జి మినహాయింపు ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యుత్ సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ ఫణీంద్రకుమార్, రూరల్ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుపై రైతుల ఆసక్తి

సీతానగరం: ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రోత్సాహాలు అందిస్తుండడంతో మిశ్రమ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పామాయిల్ తోటల సాగుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుండడంతో మండలంలో సాగునీటి సదుపాయం ఉన్న రైతులు పామాయిల్ తోటలు సాగుచేస్తున్నారు. పామాయిల్ తోటలో మిశ్రమ పంటలుగా నువ్వు చేను, అరటి, వేరుశనగ, పెసర, జొన్న తదితర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. మండలంలో సుమారు 2,600 ఎకరాల విస్తీర్ణంలో ఫామాయిల్ సాగు చేస్తున్నట్లు ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు.

ఉత్తుత్తి ప్రచారాలు మానుకోవాలి

వీరఘట్టం: జనసేన పార్టీ చేస్తున్న ప్రచారాలన్నీ ఉత్తుత్తివేనని వీరఘట్టం మండలం చిట్టపులివలస గ్రామ మాజీ సర్పంచ్ రంభ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చిట్టపులివలసలో కొంత మంది టీడీపీ నాయకులకు జనసేన పార్టీ కండువాలు కప్పి వారంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారని జనసేన నాయకులు చేస్తున్న ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని శ్రీనివాసరావు తెలిపారు. మా గ్రామంలో 340 కుటుంబాలకు చెందిన 1052 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అయితే చిట్టపులివలస గ్రామం నుంచి 400 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరినట్లు నిమ్మక జయకృష్ణ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి మా గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన వారెవరూ జనసేనలో చేరలేదని తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే జయకృష్ణకు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

వేడుకగా స్వామివారి కల్యాణం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భామిని: మండలంలోని సొలికిరిలో వెలసిన శ్రీ భూదేవి, శ్రీదేవిల సహిత సత్యనారాయణ స్వామిల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉపాలయాలుగా శ్రీలక్ష్మి, విఘ్నేశ్వరుడు, గరుక్మంతుడు విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఆలయ అర్చకులు చామర్తి వినయ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గవించారు. సొలికిరి, బాలేరు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొండలో రెండు నామినేషన్ల తిరస్కరణ



అభ్యర్థుల సమక్షంలో నామినేషన్‌లు పరిశీలన చేస్తున్న ఆర్‌వో బన్సల్

సీతంపేట: పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 12 నామినేషన్‌లకుగాను 2 తిరస్కరించబడ్డాయి. 10 నామినేషన్‌లు అనుమతించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నామినేషన్‌లు పరిశీలించారు. పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతితో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల ఎదుట నామినేషన్‌ల పరిశీలన చేశారు. ఇందులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థి కూరంగి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థి ఉల్లిబద్ర లక్ష్మిల నామినేషన్‌లను తిరస్కరించారు.

మూడు నామినేషన్ల తిరస్కరణ

కురుపాం: కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి వివిధ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు కలుపుకొని మొత్తం 19 మంది నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలనలో మూడింటిని తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ తెలిపారు. సీపీఎం, టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన డమ్మీ అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పాలకొండ రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకొనేలా గ్రామీణ ప్రాంత వాసులు సహకరించాలని ఎస్‌ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలగవాడ, చింతాడ, పొట్లి, అన్నవరం, అంపిలి తదితర గ్రామాల్లో ప్రజలతో శుక్రవారం ఆయన మమేకమయ్యారు. ఎన్నికల క్రమంలో నిబంధనలు తక్కువగా ఉంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని సహకరించాలన్నారు. విద్యార్థులు, యువత ఘర్షణలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



పెదగుడబలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఎస్‌ఐ వై. అమ్మన్నరావు అన్నారు. మండలంలోని చినగుడబ, పెద గుడబ తదితర గ్రామాల్లో శుక్రవారం కవాతు నిర్వహించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవద్దన్నారు. యువత తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో కాంట్రాక్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, కార్మిక సంఘ నాయకులు కోరారు. శుక్రవారం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వారి ఖర్చుల నిమిత్తం ప్రకటించిన రూ.వెయ్యి అందడం లేదన్నారు. దీని విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. యూనిఫాంలు, కుట్టు కూలీ చెల్లింపులు కూడా జరగడం లేదని తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ నాయకులు బి.రమణారావు, కార్మిక సంఘ నాయకులు సీహెచ్ సంజీవి, సురేష్, పడాల వేణు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించే బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం, డీటీ చందక సత్యనారాయణ, ఆర్‌ఐ లక్ష్మణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి



మస్టర్లను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే వేతనదారులు అవసరమైన జాగ్రత్తలను తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి టి.భాస్కరరావు అన్నారు. మండలంలోని గొట్టివలసలోని సవక బందలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉదయం 10గంటలలోగా పనులను ముగించుకొని ఇంటికి చేరుకోవాలన్నారు. సాయంత్రం 4గంటల తరువాత ఉపాధి పనుల్లో పాల్గొనాలన్నారు. కొలతల ప్రకారం పనులను నిర్వహిస్తే రోజుకు వేతనం రూ.250నుంచి రూ.300 వరకు గిట్టుబాటు అవుతుందన్నారు. పనుల్లో పాల్గొనే వారు తమతో పాటు తాగునీటిని తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయండి



ఎంసీసీ టీమ్‌కు సూచనలిస్తున్న నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ డబ్బులు చేతులు మారే అవకాశం ఉన్నందున ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని మండల ఎన్నికల నోడల్ అధికారి ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంసీసీ టీమ్‌తో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల తనిఖీ బృందాలు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. ప్రజలు వాహన తనిఖీలకు సహకరించాలని కోరారు.